# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 305
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
సెప్టెంబర్ 16, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



8లో..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన





# విలీనమా.. విమోచనా?

వివరాలు2లో..

తెలంగాణ విమోచనోత్సవాల నిర్వహణలో ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఎవరికివారు ఇష్టం వచ్చినట్లుగా జరుపుకుంటున్నారు. విమోచనోత్సవంతో లబ్ది పొందాలన్న భావనలో అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు పన్నుతున్నాయి. ఒక్క కమ్యూనిస్టులు మాత్రమే దీనిపై బలంగా నిలబడి అధికారికంగా విమోచనోత్సవం జరపాలని కోరుతున్నారు. అయినా అధికార కాంగ్రెస్ పార్టీ ఇందుకు సుముఖంగా లేదు. కేవలం ప్రజాపాలనతో విమోచన దినోత్సవాన్ని గట్టెక్కించాలని చూస్తోంది. కేసీఆర్ అధికారంలో ఉన్న పదేళ్లు సమైక్యతా దినోత్సవం పేరిట విమోచనోత్సవాన్ని నీరుగార్చారు. ఇప్పుడు ప్రజాపాలనతో కూడా అదే తంతు కొనసాగుతోంది. నిజానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు రకరకాలుగా దీనిని నిర్వహిస్తున్నాయి. ముస్లిం ఓటు బ్యాంక్ కోసం బీజేపీ, కమ్యూనిస్టులు మినహా మిగతా పార్టీలు నానా గడ్డీ కరుస్తున్నాయనడానికి విమోచన దినోత్సవం ఒక ఉదాహరణగా నిలుస్తోంది. నీ బాంచన్ కాల్మొక్త అంటూ బతుకులీడ్చిన ప్రజలు నిజాం పాలనపై ఎదురు తిరగడంతోపాటు భారత ప్రభుత్వ సైనిక చర్యతో నైజాం సంస్థానాన్ని 17 సెప్టెంబర్ 1948లో భారత్ యూనియన్ లో విలీనం చేశారు. దీంతో ఇక్కడి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చారు. అప్పటి నుంచి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్న డిమాండ్ వచ్చినప్పటికీ పాలకుల దోబూరులాట కారణంగా సరైన గుర్తింపు లభించడం లేదు.

–వరంగల్ వాయిస్ ప్రతినిధి



- రాజకీయ పార్టీల దోబూచులాట
- ముస్లీం ఓటు బ్యాంకే లక్ష్యంగా అడుగులు
- విమోచనం అంటేనే వణుకుతున్న పాలకులు
- కుదరని ఏకాభిప్రాయం
- అటు కేంద్రం.. ఇటు రాష్ట్రం వేర్వేరు పేర్లతో నిర్వహణ



## భద్రకాళి ఆదాయం రూ.62 లక్షలు

### హుండీ సొత్తును లెక్కించిన సిబ్బంది

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానానికి హుండీల ద్వారా రూ.61,58,999 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు. ఆలయ ప్రాంగనంలో మంగళవారం హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. ఆదాయాన్ని యూనియన్ బ్యాంక్ లో జమ చేసినట్లు వెల్లడించారు. ఇందులో 316 యూఎస్ఏ డాలర్లు, 15 యుఏఈ దిరమ్స్, 70 కెనడా డాలర్లు, ఐదు ఆస్ట్రేలియా డాలర్లు, 10 ఇంగ్లండ్ పౌండ్స్, 100 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఓమన్ పేరిట విదేశీ కరెన్సీ లభించిందని పేర్కొన్నారు. హుండీలో వెళ్లిన మిశ్రమ బంగారం, వెండిని తిరిగి హుండీలోనే వేసినట్లు ప్రకటించారు. ఈ హుండీ ఆదాయ లెక్కిపు కార్యక్రమానికి పర్యవేక్షకులుగా శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం, కురవి కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, దేవాలయ చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు టి.వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఎం.మయూరి, జి.స్రవంతి, ఓ.పూర్ణచందర్, బి.సతీష్, జె.వెంకటేశ్వర్లు, పాలడుగుల ఆంజనేయులు, అనంతుల శ్రీనివాస్, ఈఓ రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పర్యవేక్షించగా శ్రీ లక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్ట్ అధ్యక్షులు జి.కృష్ణారెడ్డి, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి అధ్యక్షులు జి.నవీన్ ఆధ్వర్యంలో 160 మంది సభ్యులు, దేవాలయ సిబ్బంది లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

– వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

## అభ్యసన స్థాయిలు పెంచాలి



- అందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- గూడూరులోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ తనిఖీ

8లో..



## ప్రజాపాలన వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ సత్య శారద
- ఉదయం 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, సెప్టెంబర్ 16, 2025

# విలీనమా.. విమోచనా..?



- రాజకీయ పార్టీల దోబూచులాట
- ముస్లీం ఓటు బ్యాంకే లక్ష్యంగా అడుగులు
- విమోచనం అంటేనే వణుకుతున్న పాలకులు
- కుదరని ఏకాభిప్రాయం
- అటు కేంద్రం.. ఇటు రాష్ట్రం వేర్వేరు పేర్లతో నిర్వహణ

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అటు కేంద్రం ఇటు రాష్ట్రం వేర్వేరు పేర్లతో ఉత్సవాలను నిర్వహించడం ఆహ్వానించదగిన పరిణామంగా చెప్పుకోవాలి. నిజానికి ఇందులో సిగ్గు పడాల్సిన, భయపడాల్సిన పనిలేదు. నిజాం రాజరికం కనుమరుగు చేస్తూ భారత్‌లో విలీనమైన సెప్టెంబర్ 17న ఉత్సవాలు జరుపుకోవడం నేటివరకు అధికారికంగా జరగలేదు. కేవలం మహారాష్ట్ర, కర్నాటకలో మాత్రమే ఈ ఉత్సవాలు జరిపేవారు. అనూహ్యంగా కేంద్రం విమోచనోత్సవాలు జరపాలని మూడేళ్ల క్రితం నిర్ణయిం తీసుకోవడంతో నాటి తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వం కూడా దిగిరాక తప్పలేదు.

### ముఖ్య అతిథిగా రాజ్ నాథ్ సింగ్..

ఈ యేడు యథావిధిగానే బీజేపీ తనవంతుగా కార్యక్రమం చేపట్టింది. కేంద్రం మాత్రం సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో విమోచనోత్సవాలకు శ్రీకారం చుట్టింది. దీంతో హైదరాబాద్ లో జరిగే ఉత్సవాల్లో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగురేయనున్నారు. రాంజీ గోండు త్యాగానికి ప్రతిఫలమే తెలంగాణ విమోచన దినోత్సవంగా బీజేపీ గుర్తు చేస్తోంది. అత్యంత కిరాతకంగా వెయ్యి మంది తెలంగాణ ప్రజలను ఒకే చెట్టుకు ఉరితీసిన నిర్మల్ వెయ్యి ఉరుల మర్రి ఘాతుకంలో అమరవీరులైన మన పూర్వీకులకు నివాళులు అర్పించనుంది. ఆదివాసుల ఉనికిని ప్రశ్నార్థకంగా మారుస్తున్న నిజాం – రజాకార్లపై, బ్రిటిష్ సైన్యంపై గెరిల్లా యుద్ధం చేసిన మన రాంజీగోండు పోరాట స్ఫూర్తిని స్మరించుకుందాం అంటూ పిలుపునిస్తోంది. తెలంగాణ విమోచన దినోత్సవ ఉత్సవాల్లో పాల్గొందాం.. తెలంగాణ చరిత్రను తరువాతి తరానికి అందిద్దాం.. అన్న నినాదంతో బీజేపీ ఏటా ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈయేడు కూడా పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విమోచనోత్సవాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించనున్నారు.

### ఎందరో స్ఫూర్తి..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనా దినోత్సవం పేరిట జండావందనం నిర్వహిస్తోంది. కానీ విమోచనోత్సవాలు అంటూ ప్రత్యేకంగా నిర్వహించడం లేదు. నిజానికి తెలంగాణ విముక్తి కోసం ఎందరో పోరాడారు. ఎందరో మహిళలు తమ మాన, ప్రాణాలను పోగట్టుకున్నారు. రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలయ్యారు. సర్వస్వాన్ని త్యాగం చేసిన కొమురం భీం, రాంజీ గోండు, తుర్రేబాజ్ ఖాన్, షోయబుల్లాఖాన్, వందేమాతరం రామచంద్రరావు, నారాయణరావ్ పవార్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, దాశరథి సోదరులు, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు వంటి ఎందరో మహానుభావులను స్మరించుకునేందుకు ఇదొక సరైన సమయం. అలాగే ఎందరో పోరాట యోధులను గురించి గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. త్యాగాలను తర్వాతి తరాలకు అందజేసేలా చరిత్రను అందుబాటులోకి తీసుకుని రావాలి. పాఠ్యాంశాలుగా ముద్రించాలి.

### పాలకుల విముఖత..

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని జరుపుకోలేక పోవడానికి పూర్తిగా రాజకీయ దివాళాకోరుతనం తప్ప మరోటి కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఘనమైన తెలంగాణ చరిత్రను మరుగున పడేసే ప్రయత్నాలు సరికాదంటున్నారు. ఏటా విమోచనోత్సవంపై జోరుగా వాదప్రతివాదనలు, విమర్శలు సాగుతుండేవి. అయినా తెలంగాణలో కూడా విమోచనోత్సవాలకు మోక్షం దక్కడంలేదు. ఈ ఉత్సవాలు జరపాలంటేనే ఎందుకనో తెలంగాణ పాలకులు విముఖత చూపుతూ వచ్చారు. తెలంగాణకు ముందు విమోచనోత్సవాలకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ తప్ప మరోటి జరిగేది కాదు.

### అరాచక పాలన..

భారతదేశం ఆంగ్లేయుల పాలన నుంచి ఆగస్టు 15, 1947న స్వతంత్ర మైనప్పటికీ నాటి హైదరాబాద్ సంస్థానం మాత్రం ఇంకా విముక్తి పొందలేదు. స్వేచ్ఛావాయువులు పీల్చేందుకు దాదాపు 13 నెలలు పట్టింది. ఉక్కు మనిషి, నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేకమైన చొరవతీసుకుని హైదరాబాద్‌పై పోలీసు చర్యకు ఉపక్రమించడం ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేశారు. ఈ కారణంగా నిజాం అరాచక పాలననుంచి ప్రజలకు విమోచన లభించింది. నిజానికి రాజకార్ల దాష్టీకం అంతాఇంతా కాదు. దీనిని మరుగున పడేలా చేశారే తప్ప చరిత్రగా లిఖించలేదు. హైదరాబాద్ సంస్థానంలో అరాచకాన్ని సృష్టించిన ఖాసీం రజ్వీ, 1.50లక్షల రజాకార్ సైన్యాన్ని ఏర్పాటుచేసి గ్రామాల్లో విధ్వంసం, అరాచకం, దోపిడీ, హత్యాకాండ చేయడం, మహిళలపై అత్యాచారాలు, పురుషులను చంపడం వంటివన్నీ జరిగాయి. దీనిని తెలియచేయడం ఏదో మతానికి వ్యతిరేకం ఎలా అవుతుందో పాలకులు చెప్పాలి. బ్రిటిషర్లు, అంతుకు ముందున్న పాలకులు, దేశ విభజన సమయంలోనూ జరిగాయి. ఇవన్నీ తెలుసుకుంటేనే మన చరిత్ర సంపూర్ణం కాగలదు. చరిత్రను విస్మరించిన జాతి లేదా దేశం ముందడుగేయడం కష్టం. బైరాన్‌పల్లి, పరకాల ఘటనలను ఎలా మరచి పోగలం. బైరాన్‌పల్లి ఘటనకు ఇప్పటికీ అక్కడి బురుజులు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వందల మందిని నిలబెట్టి రజాకార్లు పిట్టలను కాల్చినట్లు కాల్చారు. ఆ గ్రామాన్ని లూటీ చేసి తమ వికృతరూపాన్ని ప్రదర్శించారు. వరంగల్ జిల్లాలోని పరకాల ప్రజలు భారతదేశానికి స్వాతంత్యం వచ్చిందని త్రివర్ణ పతాకాన్ని ఎగరేస్తే నిజాం, రజాకార్లు జీర్ణించుకోలేక హత్యాకాండకు పాల్పడిన చరిత్ర నేటి యువతకు తెలవాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరికీ నిజాం పాలనలోని వాస్తవాలను తెలియజేస్తూ, వారి అరాచక పాలన నుంచి విమోచనం కోసం మన పెద్దలు చేసిన పోరాటాన్ని వివరించాలి. ఆనాటి పోరాటాలను స్మరిస్తూ ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాల్సి ఉంది. తెలంగాణ విమోచన దినోత్సవం జరపాల్సిన అవసరం గురించి ప్రజలకు తెలియపరచాలి. తెలంగాణ చరిత్ర దేశానికి మొత్తంగా తెలియాలి. ఇక్కడ జరిగిన పోరాటల గురించి తెలియాలి. ఏటా ఉత్సవాలు నిర్వహిస్తూ ఈ పోరాటలను ప్రజల్లోకి తీసుకుని పోవాలి. అప్పుడే పోరాటవీరుల త్యాగాలకు గుర్తింపు దక్కుతుంది.





### విమోచన కాదు.. విలీనమే :
**- కె.నారాయణ, సీపీఐ జాతీయ కార్యదర్శి**



సెప్టెంబరు 17 తెలంగాణ విలీన దినమేనని.. విముక్తి దినం కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. కానీ భాజపా దీన్ని ముస్లింలపై సాధించిన విజయంగా చూపడానికి విముక్తి దినంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన తెలంగాణ సాయుధపోరాటంలో నాలుగున్నర వేల మంది చనిపోయారని చెప్పారు. మగ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో సెప్టెంబరు 11న తెలంగాణ సాయుధపోరాటం ప్రారంభమైన తరుణంలో నిజాం నవాబు సెప్టెంబరు 17న విధిలేక కేంద్రానికి లొంగిపోయారని పేర్కొన్నారు. రాజీమార్గం ద్వారా ఆనాడు విలీనం జరిగిందన్నారు. అందుకే దాన్ని తాము విలీనదినంగానే ప్రకటిస్తున్నామని నారాయణ చెప్పారు. దీనిని చిలువలు పలువలుగా చేసి బీజేపీ రాజకీయ లబ్ది కోసం పాకులాడుతోందన్నారు. కమ్యూనిస్టులు ఆనాడు చూపిన తెగువ మరువలేనిదన్నారు. భారత్‌లో నిజాం యూనియన్ విలీనం అయ్యిందన్నది వాస్తవమని నారాయణ అన్నారు.

### తెలంగాణ చరిత్రపై వక్రభాష్యం :
**- ఎన్.రామచంద్రరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు**



సెప్టెంబర్ 17ను విమోచన దినంగా జరుపుకోవడం తెలంగాణ సాయుధ పోరాటాన్ని గౌరవించడమేనని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అన్నారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ కూడా దీనిని విస్మరించిందని ఆరోపించారు. వీరికి కూడా మజ్లిస్ భయం పట్టుకుందన్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదన్నారు. తెలంగాణ విమోచన దినాన్ని మరచిపోయి మాట్లాడుతున్న వారు గతంలో ఏం మాట్లాడారో గుర్తుకు తెచ్చుకుంటే మంచిదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విమోనోత్సవాలను జరపాలని డిమాండ్ చేసిన వారు, అధికారంలోకి రాగానే మాట మార్చడం తెలంగాణ ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వరకు ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా బానిసత్వపు ఆలోచనలను విడనాడి మన వాస్తవ చరిత్రను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో ముందుకు కదలాలని రామచంద్రరావు అన్నారు.

## ఘనంగా శ్రీ జయంతి

**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం సూర్యుడు సింహరాశిలో ఉన్నపుడు ఆచరించే ఈ వేడుకను శ్రీ జయంతిగా కూడా పిలుస్తారని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకుడు సిద్ధాంతి తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య తెలిపారు. సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం స్వామి వారికి 108 లీటర్ల పాలాభిషేకంతో ప్రారంభించి, 25 కిలోల వెన్నతో అలంకరణ చేసి, పుష్పాభిషేకాలతో వేద పండితులు అనంతాచార్య, గోవిందాచార్య, రాఘవాచార్య, ఇంగరాచార్యులు, జగన్నాథాచార్యులు, సింగరాచార్యులు, శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి 21 రకాల ప్రసాదాల నివేదన చేసి పూజానంతరం భక్తులకు వితరణ చేశారు. కన్నుల పండుగలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, వికాస తరంగిణి సభ్యులు, భక్తులు ప్రత్యేకించి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు.



# మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి

◆ రిటైర్డ్ డిప్యూటీ ఇంజినీర్ వైద్యం రాజగోపాల్
◆ ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ యూనిట్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ డిప్యూటీ ఇంజినీర్ వైద్యం రాజగోపాల్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య కేవలం ఒక గొప్ప ఇంజినీర్ మాత్రమే కాదని, ఒక సామాజిక ఇంజినీర్ అని కొనియాడారు. దేశాభివృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి, మురుగునీటి శుద్ధి, వరదల నివారణ, వ్యవసాయ నీటి వనరుల నిర్వహణకు విశ్వేశ్వరయ్య చేసిన కృషి అపారమని రాజగోపాల్ పేర్కొన్నారు. ఉత్తర భారతదేశంలో గంగా నదిపై రవాణా కోసం బ్రిడ్జిల నిర్మాణం, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. నవాబుల కాలంలో హైదరాబాద్‌లోని మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు, ఆయన సలహా మేరకు వరద నియంత్రణ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఆయన ప్రత్యేకంగా రూపొందించిన ఆటోమేటిక్ ఫ్లడ్ కంట్రోల్ గేట్లు చరిత్రలో ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయని చెప్పారు. మైసూర్ రాజ్యంలో దివాన్‌గా (ముఖ్యమంత్రిగా) పనిచేస్తూ కృష్ణరాజసాగర్ డ్యామ్‌ను నిర్మించారని, విద్యావేత్తగా, సంఘసంస్కర్తగా కూడా ఇంజినీరింగ్ కాలేజీల అభివృద్ధికి పాటుపడ్డారని రాజగోపాల్ వివరించారు. ఈ సేవలను గుర్తించి భారత ప్రభుత్వం 1955లో భారతరత్నతో సత్కరించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఏబీపీవీఈఎస్ వరంగల్ ఇంజినీర్ల విభాగం అధ్యక్షుడు, కిట్స్ కళాశాల ప్రొఫెసర్ చింతకింది శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని ఇంజినీర్లకు విజ్ఞప్తి చేశారు. దేశసేవకు అంకితమైన విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని ఇంజినీర్లు అందరూ సంఘసేవ దృక్పథంతో విధులు నిర్వహించి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జనరల్ సెక్రటరీ అనుమాండ్ల రామకోటి, కోశాధికారి కుక్కల శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ రిటైర్డ్ ఇంజినీర్ రవీందర్, ఇంజినీర్లు భావన ఋషి, పద్మశాలి ఉద్యోగుల సంఘం మీడియా కార్యదర్శి సాయిరాజు, నరసింహం, వి.అశోక్, భల్లా శ్రీనివాస్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలి ఇంజినీర్లు అందరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు.



# ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, దామెర :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దామెర మండలంలోని లాదెల్ల గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని రూరల్ హెల్త్ సెంటర్ లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, ఇతర పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ ఈ శిబిరంలో 88 మందికి రక్తపోటు (బీపీ), షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ వైద్యులు డా.జె.కిషన్ రావు, డా.మొహమ్మద్ తయార్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, ఎ.గంగాధర్, రజాకర్, శ్రీకాంత్, రమేష్, కిట్స్ కళాశాల విద్యార్థి జి.వర్షిత్ తో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఒడితల రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** హుజురాబాద్ ప్రాంత అభివృద్ధికి, ముఖ్యంగా తాగునీరు, విద్యారంగాలలో విశేష సేవలు అందించిన మాజీ రాజ్యసభ సభ్యులు స్వర్గీయ ఒడితల (సింగాపురం) రాజేశ్వర్ రావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఒడితల ప్రణవ్ మాట్లాడుతూ రాజేశ్వర్ రావు ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి ప్రజల కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, హుజురాబాద్ నియోజకవర్గాన్ని విద్య, ఉద్యోగ కల్పనలో అగ్రస్థానంలో నిలబెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రణవ్ వారందరినీ ఆప్యాయంగా పలకరించి, రాజేశ్వర్ రావు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# వాకర్స్ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, వరంగల్:** శ్రీ రంగనాయకస్వామి వాకర్స్ పరపతి సంఘం 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కరీమాబాద్‌లోని పద్మశాలి భవనంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్వతి కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి నివేదికను సభ్యులు ఆమోదించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పార్వతి కృష్ణంరాజు, ప్రధాన ఉపాధ్యక్షులుగా కాల్వ అంజయ్య, కార్యదర్శిగా బండి రవీందర్, కోశాధికారిగా పత్తిపాక సాంబశివుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గోరంటల కిషన్, బిట్ల క్రాంతి కుమార్, కస్తూరి రాజు, కన్నెబొయిన రవి, మెడిపెల్లి రాజులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎలక్షన్ ఆఫీసర్లుగా ఏలగొండ రవీందర్, భైరబోయిన మనోహర్ పర్యవేక్షించారు. సమావేశంలో అధ్యక్షుడు పార్వతి కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ ఏడాది సభ్యులందరూ కలిసి ఒరిస్సా యాత్రను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. ఇకపై ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి టూర్ వెళ్లాలని సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, రాయపర్తి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్) వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్ డిమాండ్ చేశారు. ఈరోజు రాయపర్తి మండల సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సర్వే అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పనులు ఇంకా పూర్తి కాలేదని శరత్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో పనులు సగంలోనే ఆగిపోయాయని, దీంతో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో కూడా లోపాలు ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆయన స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భరత్, నిఖిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి పాఠశాలలో కళా ఉత్సవ్



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 'కళా ఉత్సవ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ వేషధారణల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను, సృజనాత్మకతను వెలికి తీయడమే 'కళా ఉత్సవ్' ప్రధాన ఉద్దేశమని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన లంబాడి నృత్యం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవ, కంచ రాజు కుమార్, మేకల సత్యపాల్, విద్యా వాలంటీర్ నిడిగొండ అక్షయతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి అన్నారు. గతంలో కేసీఆర్ అధికారికంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని ఆయన ఆరోపించారు. తెలంగాణ విమోచన దినోత్సవం వెనుక ఉన్న చరిత్ర ప్రజలకు తెలియాలని ఆయన అన్నారు. 1947 ఆగస్టు 15న దేశమంతా బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది సంబరాలు చేసుకున్నప్పుడు, హైదరాబాద్ సంస్థాన ప్రజలకు ఆ అదృష్టం దక్కలేదని మార్తభిక్షపతి గుర్తు చేశారు. అప్పటి నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్, తాను కూడా స్వతంత్రుడిని అని ప్రకటించుకున్నారు. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కానీ, పాకిస్తాన్‌లో కానీ కలవదని, స్వతంత్రంగా ఉంటుందని ప్రకటించారని వివరించారు.ఈ పరిస్థితుల్లో నాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్, హైదరాబాద్ సంస్థానంపై చర్య తీసుకోవాలని నిర్ణయించారని మార్తభిక్షపతి తెలిపారు. నిజాం నవాబు పాకిస్థాన్ సహాయం కోరడంతో పాటు ఐక్యరాజ్యసమితిని ఆశ్రయించారని గుర్తు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం 'ఆపరేషన్ పోలో' పేరిట హైదరాబాద్ సంస్థానాన్ని ముట్టడించిందని, దీనిని 'పోలీస్ యాక్షన్' అని కూడా అంటారని వివరించారు. చివరకు, సెప్టెంబర్ 17న నిజాం నవాబు లొంగుబాటు ప్రకటన చేయడంతో హైదరాబాద్ సంస్థానానికి, తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం లభించిందని మార్తభిక్షపతి చెప్పారు. అందుకే సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుకుంటున్నారని, ఈ దినోత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.



# యూరియా కోసం రైతుల పడిగాపులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** జిల్లాలో యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పర్వతగిరి మండలంలోని రైతు వేదిక సొసైటీ వద్ద యూరియా బస్తాల కోసం రైతులు రాత్రి నుంచే చలిలో పడిగాపులు కాస్తున్నారు. అయినా వారికి ఒక్క బస్తా కూడా దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు మాట్లాడుతూ, అన్నదాతలను అరిగోస పడేలా చేస్తున్న యూరియా కొరతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత లేదని అధికారులు, నాయకులు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. గత నెల రోజులుగా ఇదే పరిస్థితి మండల రైతులకు ఎదురవుతుందని, అయినా ఇంతవరకు రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లలో ఏ ఒక్క రైతు కూడా ఇలా రోడ్డున పడ్డ పరిస్థితి లేదని రాజేశ్వర్ రావు గుర్తుచేశారు. తక్షణమే రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

# విష్ణువరన్‌ను పరామర్శించిన సోదా రామకృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల :** ఇటీవల ప్రమాదవశాత్తు కాలుకు గాయమైన పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు మునిగంటి విష్ణువర్ధన్‌ను పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పరామర్శించారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ సభ్యులు కూడా ఉన్నారు. విష్ణువర్ధన్ నివాసానికి వెళ్లిన రామకృష్ణ, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలో విష్ణువర్ధన్ క్రియాశీలక పాత్ర పోషిస్తారని కొనియాడారు. ఈ పరామర్శలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజి రెడ్డి, వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ (బుజ్జన్న), మార్కెట్ డైరెక్టర్లు వైద్యుల వెంకటరాజీ రెడ్డి, శానం కుమారస్వామి, పెండ్యాల కుమారస్వామి, బుడిమే రాజయ్య, ఎం.డి రంజాన్, నల్లెల్ల కుమార్ స్వామి, గాదే విజయ్, బొమ్మకంటి రుద్రమదేవి, చంద్రమౌళి, భోగం కమల తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 10వ డివిజన్, కాపువాడలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు స్థానికుడు అడప రామారావు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. రాసిన ఈ లేఖలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నిర్లక్ష్యంపై తీవ్ర ఆరోపణలు చేశారు. లేఖలో గత కొంతకాలంగా కాపువాడలో పారిశుద్ధ్యం పూర్తిగా అటకెక్కింది. దీనిపై ఎన్నిసార్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోవడం లేదని, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించడానికి కూడా రావడం లేదని రామారావు ఆరోపించారు. దీనివల్ల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై వెంటనే దృష్టి సారించి, కమిషనర్ స్వయంగా లేదా ఉన్నతాధికారులను పంపి సమస్యలను పరిష్కరించాలని రామారావు కోరారు. తక్షణమే చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మత మార్పిడి కేంద్రాలుగా క్రైస్తవ మిషనరీల విద్యాసంస్థలు



**వరంగల్ వాయిస్, జనగామ :** చిన్నారుల పసి మనసుల్లో మతమార్పిడీ విష బీజాలు నాటుతున్న క్రైస్తవ మిషనరీ విద్యాలయాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా నిర్వాహకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవ, జిల్లా విద్యాశాఖాధికారి మరియు అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ ను కోరారు. మంగళవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో పింకేష్ ను కలిసి జనగామ పట్టణంలోని పలు క్రైస్తవ మిషనరీ స్కూళ్లల్లో జరుగుతున్న మతమార్పిడీ ప్రయత్నాల గురించి వివరంగా తెలియజేశారు. పలు పాఠశాలల్లో ఉదయం ప్రార్థనలో జాతీయ గీతం, దేశభక్తి గేయాలతో పాటుగా క్రీస్తు స్తోత్రాలను చదివిస్తున్నారని, అనంతరం అమెన్ అని, ప్రెయిస్ థ లార్డ్, హల్లేలూయా వంటి పదాలు పలికిస్తున్నారని, అంతటితో ఆగకుండా పిల్లలు బైబిల్ చదవాలని, చర్చిలకు వెళ్లాలని ప్రలోభాలకు గురిచేస్తున్నారని, హిందూ చిన్నారులు బొట్టు పెట్టుకోకూడదని, దేవాలయాలకు వెళ్లకూడదని బోధిస్తున్నారని తెలియజేశారు. విద్యార్థుల్లో దేశ భక్తి, జాతీయత, సౌభాతృత్వం, సేవాతత్వం బోధించాల్సిన విద్యాలయాలు క్రైస్తవ మతమార్పిడీలకు కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుప్రాయంలో మతకల్మషాలను నూరిపోయడం వల్ల సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావలసిన నవతరం మత మార్పిడీకి గురై, దేశద్రోహులుగా, సమాజ విచ్ఛిన్నకర శక్తులుగా మారే అవకాశం ఉంటుందని, సమాజ భవిష్యత్తు కాపాడంలో భాగంగా ఇటువంటి విద్యాలయాలపై తక్షణమే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన పింకేష్ కుమార్ ఇట్టి విషయంపై పరిశీలించి తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామని, పాఠశాలల్లో మత సంబంధ బోధనలు చేయడం నేరమని తెలియజేశారు. వెంటనే పరిశీలనకై సంబంధిత అధికారులకు సైతం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం కార్యాలయం బయట విశ్వహిందూ పరిషత్ సభ్యులు జాతీయ నినాదాలు చేస్తూ హిందూ చిన్నారులే లక్ష్యంగా ఇటువంటి మతమార్పిడులకు పాల్పడుతున్న విద్యాలయాల విధానాలపై సహించబోమని, క్రైస్తవ ప్రార్థనల్లో కేవలం క్రైస్తవులు మాత్రమే ఉండాలి తప్పా హిందువులను బలవంతం చేయకూడదని హెచ్చరించారు. తల్లిదండ్రులు ఇప్పటికైనా మేల్కోవాలని ఇటువంటి మిషనరీ స్కూళ్లకు తమ పిల్లలను దూరంగా ఉంచాలని, క్రైస్తవ ప్రార్థనల్లో మన పిల్లలు పాల్గొనకుండా మతమార్పిడీ వైపు చూడకుండా జాగ్రత్త వహించాలని, క్రైస్తవ బోధనలపై తల్లిదండ్రులే తిరిగి ప్రశ్నించాలని, నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు అంబటి బాలరాజు, కోశాధికారి కుందారపు బైరునాథ్, జిల్లా కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, హిందు సంఘ నాయకులు ఉల్లెంగుల రాజు, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మధు, రమేష్, సంపత్, రణధీర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న లంబాడీల ఆత్మగౌరవ నిరసన ధర్నాకు మద్దతుగా లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎల్ జేఏసీ) గ్రేటర్ వరంగల్ కమిటీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించింది. ఈ మేరకు జైసింగ్ రాథోడ్, జాటోత్ కిషన్ నాయక్ నేతృత్వంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ఎల్-జేఏసీ చైర్మన్ భుక్య మోతిలాల్ నాయక్, కన్వీనర్లు బానోత్ నవీన్ నాయక్, నునావత్ జవహర్ నాయక్, మాజీ జెడ్పీటీసీ వీరమ్మ గోపీసింగ్ నాయక్ ప్రసంగించారు. రాజ్యాంగబద్ధంగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడీలను కించపరుస్తూ, అవమానిస్తూ మాట్లాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్లు సమ్మయ్య రాథోడ్, అజ్మీర వెంకట్ నాయక్, బానోత్ భాస్కర్ నాయక్, గుగులోత్ వీరమ్మ బాయి, ధరావత్ దేవేందర్ నాయక్, అముగోత్ సుధాకర్ నాయక్, లావుడియా రాజు నాయక్, అజ్మీర సునీత బాయి, తేజావత్ ఫణి కుమార్ నాయక్, భూక్య రమేష్ నాయక్, బానోత్ వీరు నాయక్, లావుడియా బాలు నాయక్, బానోత్ అశోక్ నాయక్, బానోత్ శ్రీకాంత్ నాయక్, భూక్య సిద్దు నాయక్, ధరావత్ రాము నాయక్, లావుడియా రాము నాయక్, బానోత్ ఈరియా నాయక్ పాల్గొన్నారు.

# రాష్ట్ర జేఏసీ నేతలకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లను ఘనంగా సన్మానించారు. నాంపల్లిలోని టీఎన్జీవో కేంద్ర సంఘ కార్యాలయంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఉద్యోగ సంఘాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న గుర్తింపు, జీ.ఓ. నెం. 185 ద్వారా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు, అలాగే ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను పటిష్టం చేయడానికి కమిటీ ఏర్పాటు వంటి వాటికి కృషి చేసినందుకు గాను మారం జగదీశ్వర్, ముజీబ్‌లకు ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం మెడికల్ డిపార్ట్‌మెంట్‌లోని మినిస్టీరియల్ విభాగంలో పదోన్నతులు కల్పించాలని కోరుతూ వారికి వినతిపత్రం అందజేశారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించినట్లు ఆకుల రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీప్రసాద్, ములుగు జిల్లా అధ్యక్షుడు పోలు రాజు, నవీన్, రామాంజనేయులు, త్రివేణి, ఫాతిమా, వేణుగోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యవిద్యకు ఉదయమ్మ దేహం దానం



**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రశాంత్ నగర్‌లోని సహృదయ ఆశ్రమం నివాసి ఉదయమ్మ (69) అనారోగ్యంతో మరణించగా, ఆమె దేహాన్ని వైద్యవిద్య కోసం దానం చేశారు. ఆశ్రమం నిర్వాహకులు యకూబీ చోటేమియా సమాజ హితాన్ని కోరి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయమ్మ దేహాన్ని 'తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్' ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో కేఎంసీ (కాకతీయ మెడికల్ కాలేజ్) అనాటమీ విభాగానికి అప్పగించారు. కేఎంసీ అనాటమీ విభాగాధిపతి డా.శశికాంత ఆదేశాల మేరకు అనాటమీ వైద్య విద్యార్థులు, సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రణయ్ దేహాన్ని విభాగానికి తరలించారు. ఈ సందర్భంగా డా. శశికాంత మాట్లాడుతూ, ఉదయమ్మ దేహం భవిష్యత్ వైద్యులకు వైద్య విద్య, శాస్త్ర పరిశోధన, సర్జరీలను నేర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సహృదయం చాటుకున్న ఉదయమ్మ కుటుంబానికి, దాతల అసోసియేషన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం శరీర దానం చేయడం వల్ల వందలాది మందికి వైద్య పాఠం అవుతుందన్నారు. శరీర దానం గురించి మరిన్ని వివరాలకు 8790548706, 9490133650 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎం.పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.రాజేంద్రప్రసాద్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.కేదారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, సెప్టెంబర్ 16, 2025

# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

**◆ 'పరకాల ఇందిరా మహిళా డైరీ'నే సాక్ష్యం**
**◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల :** మహిళల ఆర్థికాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేసిన 'పరకాల ఇందిరా మహిళా డైరీ'కి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు. పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో దామెర, ఆత్మకూరు, నడికుడ, పరకాల మండలాల నుంచి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ డైరీ ఆవశ్యకత, నిర్మాణం, పాల ఉత్పత్తి, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రాథమిక సొసైటీ స్థాయిలోనే ఈ డైరీ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. "నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన ఆడబిడ్డల రుణం తీర్చుకోవడానికి ఈ డైరీని ఏర్పాటు చేస్తున్నాము" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో, అధికారుల కృషితో, రాజకీయాలకు అతీతంగా పరకాల డైరీని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి మహిళను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలంటే పాడి పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఇది కేవలం ఆర్థిక వ్యాపారం మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో వెలుగు నింపే మహా యజ్ఞం అని అభివర్ణించారు. సమాజానికి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించడమే పరకాల ఇందిరా మహిళా డైరీ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఈ యజ్ఞంలో పరకాల నియోజకవర్గ ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలపై సమీక్ష



**వరంగల్ వాయిస్, జనగామ:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న జరగనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆయన అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పింకేష్ కుమార్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో జరిగే వేడుకలకు ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు, ప్రోటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించిన పలు విభాగాల బాధ్యతలను అధికారులకు అప్పగించారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను జెండా ఆవిష్కరణ, గార్డ్ ఆఫ్ హానర్ ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించారు. వీఐపీలు, మీడియా, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీటింగ్ గ్యాలరీ ఏర్పాటు బాధ్యతను ఆర్డీఓ గోపిరామ్‌కు అప్పగించారు. పారిశుద్ధ్యాన్ని సరిగ్గా నిర్వహించాలని జనగామ మున్సిపల్ కమిషనర్‌ను, స్టేజ్‌ను అందంగా అలంకరించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఈని, ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారిని ఆయన ఆదేశించారు. అనంతరం, డీసీపీ, ఆర్డీఓ, కలెక్టరేట్ ఏఓ, తహసీల్దార్‌లతో కలిసి కలెక్టరేట్‌లో జరుగుతున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పరిశీలించారు.

# రైతులకు యూరియా అందేదెప్పుడు?

**తాటిపాముల వెంకట్రాములు**



**వరంగల్ వాయిస్, వరంగల్:** రాష్ట్రంలోని రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాలకులు ఈ సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెయుఎం) జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "సమృద్ధిగా వర్షాలు పడి, వరి నాట్లు పూర్తయి, కలుపులు తీసే దశలో యూరియా దొరకక రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. యూరియా బస్తాల కోసం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తూ తీవ్ర ఆవేదనతో రగిలిపోతున్నారు" అని వెంకట్రాములు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరాలకు సరిపడినంత యూరియాను సకాలంలో సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కేంద్ర ప్రభుత్వానికి ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. గతంలో రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చినప్పుడు రైతులు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారని, ఆ పోరాటంలో 700 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోతే కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేసి రైతులకు క్షమాపణలు చెప్పిందని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడంలో, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలమైన కేంద్రం, ఇప్పుడు రైతులకు అత్యంత అవసరమైన యూరియాను కూడా అందించకపోవడం దుర్మార్గమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా సరఫరా విషయంలో కేంద్రంపై రాష్ట్రం, రాష్ట్రంపై కేంద్రం ఆరోపణలు చేసుకోవడం మానుకోవాలని వెంకట్రాములు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, అలాగే రాష్ట్రంలోని బీజేపీ కేంద్ర మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి యూరియాను యుద్ధ ప్రాతిపదికన తెప్పించి రైతులకు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతాంగం ఆగ్రహానికి కేంద్ర, రాష్ట్ర పాలకులు గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా నగరంలోని ఏవీవీ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'సేవ్ ఓజోన్, సేవ్ లైఫ్' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ పొర క్షీణత, దాని ప్రభావాలపై వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.భుజంగ రెడ్డి మాట్లాడుతూ భూమికి సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత (యూవీ) కిరణాల నుంచి ఓజోన్ పొర ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. వివిధ రకాల కాలుష్యం వల్ల ఈ పొర పలచబడుతుందని, దాని ప్రభావంతో చర్మవ్యాధులు, క్యాన్సర్ వంటి రోగాలు వస్తాయని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడటానికి అందరూ పెద్ద ఎత్తున చెట్లు పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లోరోఫ్లోరో కార్బన్స్ (సీఎఫ్ సీ), పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే నైట్రోజన్ ఆక్సైడ్స్ వంటి కాలుష్య కారకాల వల్ల ఓజోన్ పొర క్షీణిస్తుందని వివరించారు. ఎండ నుంచి గొడుగు ఎలా అయితే మనల్ని కాపాడుతుందో, అదే విధంగా సూర్యుడి నుంచి వచ్చే యూవీ కిరణాల నుంచి ఓజోన్ పొర మనల్ని, భూమిని కాపాడుతుందని ఆయన సింబాలిక్‌గా తెలిపారు. ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు కృషి చేసి, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బరుపాటి గోపి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎస్. అనిత, రమేష్, సీనియర్ వలంటీర్లు దేవి శ్రీ ప్రసాద్, సాకేత్, రాజకుమార్, సాత్విక్, చిరంజీవి, సాయి హర్షిత్, నవ్య, చందన, మన్విత, సాత్విక, మిన్ను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**వరంగల్ వాయిస్, గణపురం:** ప్రసిద్ధి గాంచిన కాకతీయుల కాలంనాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గత 70 సంవత్సరాలుగా ఈ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూల శ్రీనివాస్ గౌడ్, మొట్టపోతుల రాజన్న గౌడ్, బటిక స్వామి, బూర రాజగోపాల్ గౌడ్, ఉయ్యాల బిక్షపతి గౌడ్, మాదాసు మొగిలి గౌడ్, మాదాసు అర్జున్ గౌడ్, దెయ్యాల భద్రయ్య, పాండవుల భద్రయ్య, గోరంట్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# విహారయాత్రతో వినోదం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** నగరంలోని కాశిబుగ్గకు చెందిన సుమారు 60 మంది యాత్రికులు ఝార్ఖండ్ రాష్ట్రంలోని వైద్యనాథ్ జ్యోతిర్లింగ దర్శనం కోసం విహారయాత్రకు వెళ్లారు. అక్కడ పలు పుణ్యక్షేత్రాలను కూడా సందర్శించినట్లు యాత్ర నిర్వాహకులు తెలిపారు. ఈ యాత్రలో కాశిబుగ్గ వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు సాంబార్ మల్లేశం, ఉపాధ్యక్షుడు లకుం భాస్కర్, కోశాధికారి వంగరి రవి, మైటీ సాగర్, సభ్యులు చిలుపూర్ మల్లేశం, వంగరి రాజశేఖర్, దేవలపల్లి రాజేశ్వరరావు, వంగరి వేణుగోపాల్, నల్ల ఓదెలు, దూడం రాజనారాయణ, గైని రాజశేఖర్, వంగరి సమ్మయ్య, రాజా కమల్, అభిరాజ్ తదితరులు పాల్గొన్నారు. యాత్రలో అందరూ ఉల్లాసంగా, ఆధ్యాత్మికంగా గడిపినట్లు పేర్కొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** ఓ చిన్నారి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. డోర్నకల్ మండలంలోని కన్నెగుండ్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 150 మంది విద్యార్థులకు వరంగల్‌కు చెందిన అమెరికా సెటిలర్లు గంద్ర శ్రీకాంత్, ప్రతిమాల దంపతుల కుమారుడు గంద్ర అధర్ నాలుగో పుట్టినరోజు సందర్భంగా సుమారు రూ.8,000 విలువ చేసే పుస్తకాలను బహూకరించారు. అధర్ తాత రేగుల వెంకటేశ్వర్లు (రిటైర్డ్ ఎస్‌బీఐ మేనేజర్), అమ్మమ్మ రేగుల ఉమల ప్రోత్సాహంతో, కన్నెగుండ్ల జెడ్పీ స్కూల్ ఫిజిక్స్ టీచర్ కోవిలా రాజేశ్వర్ ఈ పుస్తకాలను సమకూర్చగా, ఎంఈఓ ఆంగోత్ లక్ష్మ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థులు పేద, ధనిక అనే తేడా లేకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పేదరికం చదువుతో పాటు అనుభవాన్ని ఇస్తుందని, పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని అన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, వినయం, విద్య జీవించడం నేర్పుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రాజేశ్వరి, ఉరియా, నాగమణి, మాదవరావు, వెంకన్న, వెంకట్రామ నర్సయ్య, రామూర్తి, రామకృష్ణ, నరేందర్, శేఖర్, లోకేందర్ తదితరులు పాల్గొన్నారు.


# యూరియా కొరత పాపం కేంద్రానిదే

◆ రైతులను తప్పుదోవ పట్టించొద్దు
◆ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ఈ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి ఒడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం నాడు హుజురాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హుజురాబాద్‌తో పాటు ఐదు మండలాలకు చెందిన 147 మంది లబ్ధిదారులకు రూ. 54,31,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రణవ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలోని రాష్ట్రాలకు యూరియా సరఫరా చేసేది కేంద్ర ప్రభుత్వమేనని బీజేపీ ఎంపీలే చెబుతున్నారని, అందుకు విరుద్ధంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని విమర్శించారు. తెలంగాణలోనే కాకుండా బీజేపీ పాలిత ఆంధ్రప్రదేశ్‌లో కూడా యూరియా కొరత ఉందని, దీనికి ఈటెల రాజేందర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతపై బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, దీంతో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఉన్న చీకటి ఒప్పందం బయటపడుతోందని ప్రణవ్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందని కేటీఆర్ బహిరంగంగా ఒప్పుకున్నారని, చిన్న ఉద్యోగి వద్దే వందల కోట్లు దొరికితే ప్రాజెక్టు రూపకర్తలైన కేసీఆర్, కేటీఆర్‌ల వద్ద ఇంకా ఎన్ని కోట్లు దొరుకుతాయని ఆయన ప్రశ్నించారు. "మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం" అని ప్రణవ్ స్పష్టం చేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖలు రాశారని, 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను తెప్పించుకున్నారని, మళ్లీ యూరియా కోసం అడిగారని తెలిపారు. రైతుల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న రాజకీయం కాంగ్రెస్ ప్రభుత్వం చేయబోదని, తమకు రాజకీయాల కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ




**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** మాజీ రాజ్యసభ సభ్యులు స్వర్గీయ ఒడితల రాజేశ్వరరావు జయంతి సందర్భంగా హుజురాబాద్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఒడితల రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గం ఇంఛార్జి ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కమలాపూర్ మండలంలోని 25 మంది లబ్ధిదారులకు రూ. 11,47,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను దివాలా తీయించినా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి సీఎంఆర్ఎఫ్ చెక్కులను త్వరగా అందిస్తోందని ఈ సందర్భంగా ఝాన్సీరాణి రవీందర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టాలని ఆమె ప్రజలను కోరారు.

## ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై చర్యలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి స్థానిక న్యాయస్థానం జరిమానాలు విధించింది. వరంగల్ రెండో అదనపు మెజిస్ట్రేట్ శ్రీ అబ్బోజు వెంకటేశం ఈ తీర్పును వెలువరించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడిన ఒక వాహనదారుడికి రూ.500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23 మందికి రూ.22,800 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రోడ్డు భద్రతకు సహకరించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 44వ డివిజన్, పెన్షన్‌పూర్ గ్రామానికి చెందిన మోత్కుపల్లి రాములమ్మ (69) అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే నాగరాజు మిత్రులు మోత్కుపల్లి సత్యం, రాంబాబుల తల్లి అయిన రాములమ్మ మృతదేహానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మోత్కుపల్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 17న జనగామలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ముగింపు సభ

**వరంగల్ వాయిస్, జనగామ :** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాల ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 17న జనగామ పట్టణంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తెలిపారు. బస్టాండ్ చౌరస్తాలో మధ్యాహ్నం 12:30 గంటలకు ఈ సభ ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. సభకు ముందు ఉదయం 11:30 గంటలకు రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎం.ఎ. బేబీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కనకారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా శ్రీ గోవిందరాజస్వామి, గ్రామ దేవతల వార్షికోత్సవ మహోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 27వ డివిజన్‌లో ఉన్న శ్రీ భూ, నీల, దేవి సమేత శ్రీ గోవిందరాజస్వామి, గ్రామ దేవతల (బొడ్రాయి) 15వ వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం బోనాలు, పట్నాలు, ప్రత్యేక పూజలు కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతాకుల సునీల్, బాషపాక సదానందం, కొమ్ము రాజ్ కుమార్, జారితి రమేష్, ఇప్ప ఆదినారాయణ, మీసాల ప్రకాష్, యాట సత్యనారాయణ, జారితి శ్రీనివాస్, కట్కూరి చారి బాబు, ఇనుగల శరత్, పోలేపాక రమేష్, గద్దల శ్రీనివాస్, గద్దల నవీన్ బాబు, గద్దల అజయ్, చెమాల సాగర్, శిరబోయిన మహేష్, పోలేపాక సుందర్, పోలేపాక విజయ్, బస్కూరి గోపి, చింతాకుల రాధాకృష్ణ, ధనలక్ష్మి, మంద శోభ, శ్రీదేవి, వాడకట్టు పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు.

## నూతన డిగ్రీ కళాశాల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పనుల పురోగతిపై సమీక్షించారు. పనుల నాణ్యత ప్రమాణాలపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. "విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి తెలిపారు. ఈ కళాశాల నిర్మాణం పూర్తయితే పరకాల, దాని పరిసర ప్రాంతాల విద్యార్థులకు అత్యుత్తమ విద్యా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి




**వరంగల్ వాయిస్, కేయూ :** గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ. 8,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కేయూ దూరవిద్య ప్రాంగణం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వారు తీవ్రంగా ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలన 'ప్రజా పాలన' కాదని, 'కమీషన్ల పాలన' అని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు బొచ్చు తిరుపతి, ఆరెగంటి నాగరాజు, డి. తిరుపతి, మర్రి మహేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అన్ని కోర్సులకు సంబంధించిన దాదాపు రూ. 8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం విడుదల చేయకుండా విద్యార్థుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఒకవైపు బడ్జెట్ లేదని చెబుతూనే, మూసీ ప్రక్షాళన, ఇతర ప్రాజెక్టుల పేరిట వేల కోట్లు కేటాయించడం, కానీ విద్యార్థుల ఫీజులు మాత్రం చెల్లించకపోవడం సరికాదని అన్నారు. ఫీజుల బకాయిల కారణంగా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని పేర్కొన్నారు. ప్రైవేటు యాజమాన్యాలతో జరిపిన చర్చల్లో రూ. 600 కోట్లు దసరా తర్వాత, మరో రూ. 600 కోట్లు దీపావళి తర్వాత విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పిందని, అయితే ఈ మొత్తం విద్యార్థులకు న్యాయం చేసేలా లేదని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్లను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11యూనివర్సిటీలలోని విద్యార్థులను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్లు కీతపాక ప్రసాద్, కదికొండ తిరుపతి, విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల మనోహర్, ఎల్తూరి సాయి, ఉప్పుల శివ, కుమ్మరి శ్రీనాథ్, పెండేలా రాకేష్, బొక్క ప్రవర్ధన్, చింతం అంజనేయులు, శ్రీదేవి, స్రవంతి, పట్ట శేఖర్, ఓర్స్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.




# మోహన్‌లాల్ వృషభ

## 18న విడుదల కానున్న టీజర్

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'వృషభ'. ఈ సినిమాకు నంద కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్. వ్యాస స్టూడియోస్, ఆశీర్వాద్ సినిమాస్ సమర్పిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియాగా రాబోతున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయడంతో పాటు- టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌ను సెప్టెంబర్ 18న విడుదల చేయనున్నట్లు- తెలిపారు. ఈ సినిమా కథ పురాణాల నేపథ్యంలో, తండ్రీకొడుకుల మధ్య సాగే భావోద్వేగపూరిత పోరాటంగా ఉండబోతుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో మోహన్‌లాల్ యోధుడి పాత్రలో కనిపించనున్నారు. నంద కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, మలయాళ భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తున్నారు.

# మిరాయ్..మహాబలుడు కాపీయా







### తాజా వివాదం చక్కర్లు

తేజ సజ్జా హీరోగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన 'మిరాయ్' సినిమా తెలుగు ఇండస్ట్రీలో సంచలనం రేపుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతోంది. ఈ మూవీ మంచి కలెక్షన్స్ దక్కించుకుంటుంది. తొలి రోజు రూ. 27.2 కోట్లు వసూళ్లు రాబట్టగా, రెండో రోజు రూ.28.4 కోట్లు–, మూడో రోజు రూ.81.2 కోట్ల వసూళ్లు రాబట్టింది. వారాంతం వరకు 'మిరాయ్' రూ.100 కోట్ల మార్క్ దిశగా దూసుకుపోతోంది. కథ, యాక్షన్ సీక్వెన్స్‌లు, విజువల్ ఎఫెక్ట్స్ గురించి ప్రేక్షకులు విశేషంగా చర్చిస్తున్నారు.అయితే సినిమా విజయం మధ్యలోనే సోషల్ మీడియాలో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. నెటిజన్ రవి వల్లభనేని ట్వీట్ చేస్తూ.. 'మిరాయ్' సినిమా 1969లో విడుదలైన సూపర్ స్టార్ కృష్ణ నటించిన 'మహాబలుడు' సినిమా మక్కీకి మక్కీ కాపీలా ఉందని కామెంట్ చేశారు. అంతే కాదు, ఆ సినిమా యూట్యూబ్ లింక్ కూడా షేర్ చేశారు. దీంతో ఈ అంశం వైరల్‌గా మారింది. ఈ క్రమంలో నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు. కొందరు 'మిరాయ్ డైరెక్టర్ త్రివిక్రమ్ శిష్యుడిలా ఉన్నాడు అని అంటుండగా, మరి కొందరు మహాబలుడు, మిరాయ్‌లకు ఎలాంటి పోలిక లేదు. కథ, క్యారెక్టర్స్, సెంటిమెంట్ వేరు. ఇ ది కేవలం బురద జల్లడమే అని కొట్టిపారేస్తున్నారు. వివాదం ఒక వైపు కొనసాగుతుంటే, మరో వైపు సినీ ప్రముఖులు మాత్రం 'మిరాయ్' ని ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా రామ్ గోపాల్ వర్మ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. రూ.400 కోట్ల బడ్జెట్ ఉన్న సినిమాల కంటే కూడా బెటర్‌గా ఉన్నాయని ప్రశంసించారు. మంచు మనోజ్ విలన్‌గా నటించడం తప్పు అనుకున్నానని, కానీ సినిమా చూసిన తర్వాత తనకే తానే చెంపదెబ్బలు కొట్టుకున్నానని సరదాగా టీ`వట్ చేశారు. మొత్తానికి 'మిరాయ్' బాక్సాఫీస్ దగ్గర రికార్డులు సృష్టిస్తూనే, కాపీ వివాదంతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

# కూలీ ఓఎస్‌టీ విడుదల




రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం కూలీ. ఇటీ–వల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున విలన్ పాత్ర పోషించారు. ప్రస్తుతం ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగుతో పాటు– తమిళం, మలయాళం కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమా నుంచి పాటలతో పాటు– వీడియోలను ఒక్కొక్కటిగా యూట్యూబ్ వేదికగా వదులుతున్నారు మేకర్స్. తాజాగా ఈ మూవీ నుంచి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇస్తూ ఒరిజినల్ సౌండ్ ట్రాక్ విడుదల చేశారు.

# పవన్ కళ్యాణ్ ఓజీకి హైప్

## ప్రమోషన్స్‌లో బిజీగా ప్రియాంక అరుళ్






టాలీవుడ్‌లో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం.. 'ఓజీ'. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాపై హైప్ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రియాంక అరుళ్ మోహన్ ఎంట్రీతో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పటికే ప్రియాంక పై విడుదలైన సాంగ్స్, కొన్ని విజువల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ మంచి బజ్ క్రియేట్ చేశాయి. తన గ్లామరస్ ప్రెజెన్స్‌తో పాటు, పవన్ కళ్యాణ్‌తో ఉన్న స్క్రీన్ కెమిస్ట్రీకి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఆమె ఇప్పుడు సినిమా ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రియాంక తాజాగా ఓజి ప్రమోషన్స్ కోసం బయటికొచ్చి ప్రింట్ మీడియా, వెబ్ మీడియా లకు ఇంటర్వ్యూలు ఇస్తూ చిత్రంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్ల అసలైన జోరు మొదలైందని చెప్పవచ్చు. ఇకపై ప్రియాంకతో పాటు– మిగతా ప్రధాన నటీ–నటు–లు కూడా ఈ ప్రమోషన్లలో భాగం కానున్నట్లు– సమాచారం. ఇక ఈ సినిమా పాన్–ఇండియా లెవెల్‌లో తెరకెక్కుతున్న నేపథ్యంలో, ఇతర భాషల్లో కూడా ప్రమోషన్స్ ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఫ్యాన్స్‌లో కుతూహలంగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఎంట్రీతో ఓజికి హిందీ లోను మంచి మార్కెట్ ఏర్పడిరది. అందుకే హిందీలో ప్రత్యేక ప్రమోషన్లు ప్లాన్ చేస్తున్నారా? అన్న ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడిప్పుడే మొదలైన ప్రమోషన్లతో సినిమా హంగామా మరింత పెరిగేలా కనిపిస్తుంది. ఈ ప్రమోషన్ లు కలిపి సినిమా కోసం ప్రేక్షకుల అంచనాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లడం ఖాయం.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన



**వరంగల్ వాయిస్, క్రైం :** ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అమాయకులను మోసం చేయడంలో సైబర్ క్రైమ్ ప్రధానమైందని దీనిని నివారించుటకు మనమందరం ముఖ్యంగా యువత అప్రమత్తంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సైబర్ క్రైమ్ పై నిర్వహించిన అవగాహన సదస్సుకు సీపీ సిపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్టర్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, సైబర్ క్రైమ్ ఏసీపీ కె.గిరి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రెహ్మాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ నేరాలకు ఎవరు పాల్పడినా చట్ట ప్రకారం శిక్షించబడతారన్నారు. సైబర్ నేరాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ముఖ్యంగా ఇటీవల ఏఐ సాంకేతిక విధానం ఉపయోగించి సైబర్ నేరగాళ్లు అమాయకులను దోచుకుంటున్నారన్నారు. యువత అమాయకంగా ఎవరిని నమ్మడం గాని, డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు లోను కాకూడదని సీపీ పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ ఆపదలో ఉన్నామంటూ మనకు తెలిసిన ముఖాలు తగిలించుకొని సైబర్ నేరాలకు పాల్పడడం జరుగుతుందని యువత అటువంటి వాటిని ఎదుర్కొనే విధంగా అవగాహన కలిగి ఉండాలన్నారు.

సైబర్ నేరగాళ్లు మనకు తెలవకుండానే మన ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబర్ తో అనుసంధానం చేసుకొని మనకు తెలవకుండా బ్యాంకులో ఉన్న డబ్బును దోసుకుంటున్నారన్నారు. మనకు తెలియని వారు, ఎవరైనా ఫోన్ చేసినా, మెసేజ్ పెట్టినా, వెంటనే స్పందించవద్దని ఎవరైనా నేరాలకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు లోను కాకూడదని ప్రొజెక్టర్ ద్వారా సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ మారిన ఆధునిక కాలంలో అత్యంత భయంకరమైన నేరాలు జరుగుతున్నాయని ఇందులో ముఖ్యమైనది సైబర్ క్రైమ్ చాలా ప్రమాదకరమైందని అన్నారు. యువత దీనిపై అవగాహన కలిగి ఉండే విధంగా ఈ సదస్సును ఏర్పాటు చేశామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెహమాన్, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, నార్కోటెక్ ఇన్స్పెక్టర్ సతీష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అభ్యసన స్థాయిలు పెంచాలి

- అందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- గూడూరు లోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ తనిఖీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని ఏడు, ఎనిమిది, పదో తరగతి గదులను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. పదో తరగతి విద్యార్థులను గణిత సబ్జెక్టుకు సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రీ మిడ్లెన్ టెస్ట్ పరిశీలించారు. విద్యార్థుల ప్రవర్తన రీతి ఎలా ఉంటుందని కలెక్టర్ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. డ్రగ్స్ సంబంధిత సమస్యలు ఏవైనా ఉన్నాయా అంటూ ఆరా తీశారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నారా అంటూ ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో మెరుగ్గా ఉండేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగ్గా ఉండాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఎంఈఓ శ్రీధర్, తదితరులతోపాటు పాఠశాల ప్రిన్సిపల్ అనితా కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఈనెల 17న నిర్వహించనున్న ప్రజాపాలన వేడుకలకు పక్కడ్బంది ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం అజాం జాహి గ్రౌండ్స్ లో కొత్త కలెక్టరేట్ (ఐడీఓసీ) సమీపంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని మంత్రి ఆవిష్కరిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా వేదిక, సీటింగ్ ఏర్పాట్లు, షామియానా, బారికేడింగ్, తదితర ఏర్పాట్ల పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ రాజేందర్ రెడ్డి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఎన్పీసీపీఎల్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, డీబీసీడీఓ పుష్పలత, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలలో కృత్యమేళా..**

జిల్లాస్థాయి కృత్యమేల ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేట ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సందర్శించి 13 మండల స్థాయిలో ఎంపికై జిల్లా స్థాయికి వచ్చినటువంటి 130 టీఎల్ఎంలను పరిశీలించారు. ఒక్కొక్క టీఎల్ఎం పాఠశాల స్థాయిలో ఏ విధంగా విద్యార్థులకు అమలు పరుస్తారో వాటి ద్వారా పిల్లల సామర్థ్యాలను ఏ విధంగా అభివృద్ధి పరుస్తారో ఉపాధ్యాయులతో చర్చించి సంతృప్తిని వ్యక్తం చేవారు. అదేవిధంగా ఈ కృత్యాలను పాఠశాల స్థాయిలో అమలు పరిచి ప్రతి విద్యార్థి చదవడం, రాయడంలో ముందంజలో ఉండేటట్టు కృషి చేయాలన్నారు. జిల్లాస్థాయి కృత్యమేళాలో 130 అంశాలు ప్రదర్శించగా అందులో నుంచి ఎనిమిదింటిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరిగింది. అందులో భాగ్యలక్ష్మి జీపీఎస్ కరీమాబాద్, ఎం.స్వాతి ఎంపీపీ ఎస్.రాయపర్తి, డి.ఉమా కుమారి, జీపీఎస్ కరిమాబాద్, ఎస్.భావన యూపీఎస్ పల్లార్ గూడ, సీహెచ్ రామకృష్ణ, పీఎస్ స్వామి, రావు పల్లి, ఎన్.రత్న సింధు యూపీఎస్ బాపూనగర్, ఎ.మౌనిక పీఎస్ మైలారం, సయ్యద్ అష్రఫ్ హుస్సేన్ వీరిని సర్టిఫికెట్, మెమెంటోతో డీఈఓ, ఏఎమ్ఓ సత్కరించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎల్ఎం కన్వీనర్ కొర్ర సారయ్య, డీసీబీ కార్యదర్శి గారే కృష్ణమూర్తి, ఖిలా వరంగల్ ఎంఈఓ ప్రసాద్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదాబాయి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాపమ్మ, జ్యోతి, లక్ష్మయ్య, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, స్టేట్ రిసోర్స్ గ్రూప్ సభ్యులు చక్రవర్తుల శ్రీనివాస్, బండారు రమేష్, కృష్ణారెడ్డి, ఏవిఆర్ చార్యులు, డాక్టర్ బొమ్మెర కుమారస్వామి, తాబేలు శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి చేయూత

- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థి, కుటుంబం

**వరంగల్ వాయిస్, దామెర :** రెండు కాళ్లు కోల్పోయి ఇక జీవితం అయిపోయిందని తీవ్ర ఆందోళనకు గురైన ఓ విద్యార్థికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అందించిన ప్రోత్సాహంతో కొత్త ఆశలు చిగురించాయి. ముఖ్యమంత్రి చూపించిన దాతృత్వానికి ఆ విద్యార్థి, అతనితో పాటు కుటుంబ సభ్యులు మంగళవారం జూబ్లీహిల్స్ నివాసంలో రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వరంగల్ జిల్లా దామెర మండలం పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ జీవితంలో ఐఐటీ సాధించాలన్న పట్టుదలతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 2024 నవంబర్ 2 న రాజస్థాన్ కోటాలో శిక్షణ కోసం రైలులో ప్రయాణిస్తున్న సందర్భంలో గుర్తు తెలియని దుండగులు దాడి చేసి రైలు నుంచి బయటకు తోసేశారు. ఈ ఘటనలో విద్యార్థి తన రెండు కాళ్లను పూర్తిగా కోల్పోయాడు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వచ్చినప్పుడు మానవతా దృక్పథంతో స్పందించి, ఎంతో భవిష్యత్తు ఉన్న ఆ విద్యార్థికి అత్యంత అధునాతన కృత్రిమ కాళ్లను అమర్చే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు రాహుల్‌ను నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి దాదాపు రూ.10 లక్షలకు పైగా వెచ్చించి ఆ యువకుడికి ఆధునిక కృత్రిమ కాళ్లను అమర్చారు. రెండు కాళ్లు కోల్పోయిన తనకు మళ్లీ నడవగలిగే విధంగా అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందించిన ముఖ్యమంత్రికి రాహుల్ కుటుంబ సభ్యులతో కలిసివచ్చి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రాహుల్ భుజం తట్టి భవిష్యత్తులో బాగా చదువుకుని రాణించాలని ప్రోత్సహించారు.

# స్వీడన్ టు వరంగల్

- తండ్రి కోసం వెతుకులాట, అన్వేషణ చేస్తున్న కూతురు



**వరంగల్ వాయిస్, క్రైం :** పసితనంలోనే తల్లి, దండ్రులకు దూరమై అనాథాశ్రమంలో చేరిన చిన్నారిని స్వీడన్ కు చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. వారితో కలిసి స్వీడన్ చేరిన చిన్నారి వారి సమక్షంలోనే పెరిగి పెద్దదైంది. కాలం గడిచిపోయింది. కానీ మనసులో మాత్రం తన తల్లిదండ్రులు ఎవరనే ప్రశ్న వెంటాడుతూ వచ్చింది. దీంతో వారిని కనిపెట్టేందుకు స్వీడన్ నుంచి హైదరాబాద్ వచ్చిన సంధ్యారాణి తన మూలాలు వెతికే పనిలో పడ్డారు. వివరాల్లోకి వెలితే.. వరంగల్ జిల్లాకు చెందిన బి.రాజ్ కుమార్ నిజాం కళాశాలలో తోటమాలిగా పనిచేశాడు. అక్కడే సహోద్యోగికి సన్నిహితమై ఆమెను ద్వితీయ వివాహం చేసుకున్నాడు. వారికి బాలిక జన్మించింది. చిన్నారి పుట్టిన మూడు నెలలకే తల్లి మృతి చెందింది. దీంతో తన కుమార్తె సంధ్యారాణిని విజయనగర్ కాలనీలోని సేవా సమాజ ఆనాథాశ్రమంలో చేర్పించిన రాజ్ కుమార్ తర్వాత ఎక్కడికి వెళ్లాడో ఎవరికీ తెలియదు.

అయితే 2009లో ఉన్నత చదువుల కోసం యూకే వెళ్లిన సంధ్యారాణి స్వీడన్ లో పెరిగినప్పటికీ తన మూలాలను వెతికి పట్టుకోవాలన్న లక్ష్యంతో పుణెలోని అడాప్టీ రైట్స్ కౌన్సిల్ సాయం తీసుకుంది. తన స్నేహితుల సలహాతో హైదరాబాద్ కు వచ్చింది. అక్కడ తనను దత్తత ఇచ్చిన అనాథాశ్రమం వివరాలు సేకరించింది. తన తండ్రి రాజ్ కుమార్ వరంగల్ ప్రాంతానికి చెందిన వాడని తెలుసుకుని నేరుగా వరంగల్ వచ్చి తండ్రి కోసం అన్వేషన ప్రారంభించింది. ఇప్పటి వరకు రాజ్ కుమార్ ఎక్కడున్నడన్న స్పష్టత మాత్రం రాలేదు. అయితే రాజ్ కుమార్ గురుంచి కొంత సమాచారం తెలిసి పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ ను కలిసి తన మూలాలను తెలుసుకునే పనిలో సంధ్యారాణి ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com